# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ- సిఆర్‌డిఎతో పాటు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .**

2. **రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్.**

3. **ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని పేర్కొన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.**

4. **ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించిన మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖల పై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏపై సంబంధిత అధికారులతో రాజధాని అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చిస్తున్నారు. అనంతరం గనుల శాఖపై సమీక్ష నిర్వహించనున్నారు. ఖనిజ వనరుల వినియోగం, ఆ శాఖ పనితీరు, అభివృద్ధి చర్యలపై అధికారులతో చర్చించనున్నారు. తర్వాత రాష్ట్రంలో అమలవుతున్న రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ ఆర్టీజీఎస్ పనితీరును మధ్యాహ్నం ముఖ్యమంత్రి పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మహారాష్ట్రలోని ముంబైలో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ –ఐఏఏపీఐ ఎక్స్ పోలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ, సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని, రాష్ట్ర పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, నూతన పర్యాటక విధానం 2024-29 ద్వారా పెట్టుబడులు పెట్టె వారికి రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి వినోద పార్కులు, సముద్ర తీర ఆకర్షణలు, అడ్వెంచర్ జోన్ల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

-------------------------

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు రాయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి సూచించారు. రాష్ట్రంలో ఈనెల 16 వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులతో మంత్రి దృశ్య మాధ్యమం విధానంలో నిన్న మాట్లాడారు. ఈ సందర్భంగా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ పరీక్షల పట్ల భయం పోగొట్టేలా విద్యార్థుల్లో ధైర్యం నింపారు. పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తోందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్…30 సెకన్లు

---------------------------

ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 2 కోట్ల 51 వేల 996 రూపాయల విలువ కలిగిన చెక్కులను మంత్రి లబ్ధిదారులకు ఈ రోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వివిధ అనారోగ్య సమస్యల కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం హ్యూమన్ పాపిల్లోమావైరస్- హెచ్‌పీవీ టీకా కార్యక్రమం అమలు చేస్తోందని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గుంటూరు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో హెచ్ పీవీ టీకా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 14 ఏళ్లు నిండిన బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ లక్ష్యంగా జిల్లాలోని 83 కేంద్రాల్లో 90 రోజుల పాటు టీకా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

---------------------------

శ్రీసత్యసాయిజిల్లాలోని కదిరిలో శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ రోజు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ దేవి భూదేవి సమేతుడై స్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కె వెంకట ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం –సిఐఎస్ఎఫ్ స్థాపనకు గుర్తుగా ఈ రోజు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పారిశ్రామిక భద్రతా దళంగా గుర్తింపు పొందిన సిఐఎస్ఎఫ్ ముఖ్యమైన ప్రభుత్వ, పారిశ్రామిక భవనాలకు భద్రత కల్పిస్తారు. ప్రతి ఏటా దేశంలో మార్చి 10న 'సీఐఎస్ఎఫ్

వ్యవస్థాపక దినోత్సవం'గా నిర్వహిస్తారు. దేశ భద్రత, కీలక ఆస్తుల రక్షణలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది చేస్తోన్న కృషిని గుర్తించడం, వారిని గౌరవించడం ఈరోజు నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం. సీఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

-------------------------

క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ – శాప్ చైర్మన్ ఏ. రవినాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం తణుకు హౌసింగ్ బోర్డ్ కాలనీ, బాలుర పాఠశాల ఆవరణలో ఇండోర్ క్రీడా మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడ లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తణుకు ఇండోర్ స్టేడియంలో నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేశామని తెలిపారు.

-------------------------

దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా పేరుగాంచిన సావిత్రి బాయిపూలే వర్ధంతి ఈరోజు. సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా కుల,మత భేదాలకు అతీతమైన సమాజానికి కృషి చేసిన ఆమె... 1831 జనవరి 3వ తేదీన ప్రస్తుత మహారాష్ట్రలోని నైగావులో జన్మించారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీల అభ్యున్నతి సాధ్యమని నమ్మి పూణేలో దేశంలోనే మొదటి బాలికల పాఠశాల ప్రారంభించిన సావిత్రి బాయిపూలే 1897 మార్చి 10వ తేదీన కన్నుమూశారు.

-------------------------

మహిళా విద్యతోనే సమాజంలో మార్పు తీసుకురాగలమని తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహానికి ఈరోజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య, కుల నిర్మూలన, వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారని తెలిపారు. సావిత్రిబాయి పూలే ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

-------------------------

ఎన్టీఆర్ జిల్లా గరికపాడులోని డాక్టర్ కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం –ఖఎఖలో రైతులకు "వాణిజ్య ఉద్యానవన రంగంలో నర్సరీ యాజమాన్యం" అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హైదరాబాదుకు చెందిన కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఎఎఆర్ఎం) సౌజన్యంతో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో కేవీకే కార్యక్రమ సమన్వయకర్త ఎం. రవి కిషోర్ మాట్లాడుతూ, ఈ నెల 13వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణలో ఉద్యానవన రంగంలో రైతులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు, వారు తమ గృహాల వద్దే నర్సరీలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా నర్సరీలలో వ్యాధి నివారణ చర్యలు, వివిధ రకాల మొక్కలలో అంటుకట్టడం వంటి ఆధునిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

====================